
"ఏమిటి ? నిన్న మా ఫ్రెండొస్తే నేను లేనని చెప్పి వంపించేశావుట ? మరీ అంత వల్లెటూరి గబ్బిలాయిలా ప్రవర్తించకపోతే కాస్త కూర్చోపెట్టి కాఫీ అదీ ఇవ్వాలని తోచనైనా తోచదా నీ మొద్దు బుర్రకీ ? ఆదివారం పొద్దున్నే చిరచిర లాడపోతూ దండకం చదివాడు శ్రీధర్.

# ఎదురద్దాలు

—మీరా శేఖర్



'ఎవరెవరో వస్తూంటారు, పోతూంటారు. మీ ఫ్రెండని చెప్పెయ్యగానే తగుదునమ్మా అని నరానరి ఇంట్లో కొచ్చేసి, తిష్ఠ వేసెయ్యమని చెప్పాలా? నా కలాంటివి నచ్చవు కాబట్టి చెయ్యను." మెల్లగానే అయినా, కచ్చితంగా చెప్పింది లావణ్య.

చిన్నప్పట్నించి అమ్మమ్మ పుణ్యమా అని చదువంతా గర్ల్స్ స్కూళ్లు, కాలేజీల్లోనే అవ్వటంతో, మగవాళ్లతో పెద్దగా కలివిడిగా ఉండటం, మాట్లాడటం లాంటివి అలవాటు లేవు మరి! వాళ్లతో అనలు మాట్లాడ్డానికి ఏం ఉంది కనుక? కాఫీ ఇచ్చి, వాళ్లు త్రాగేదాకా దేభ్యంలా కూర్చోవటం తనకి చాలా ఇబ్బందిగా ఉంటుంది. అది ఈయనకి చెప్పినా అర్థం కాదు! ఖర్మ!

"ఉత్తి కంట్రీబ్రూట్! అనలు లేశమైనా సాఫిస్టికేషన్ ఉండేడిస్తేగా -", గొణిగాడు వినుగ్గా.

ఉక్రోషంతో కుతకుత లాడిపోతున్న మననుని అదుపులోకి తెచ్చుకుందామనే ఉద్దేశ్యంతో, చీర కుచ్చెళ్లు పైకి దోపుకుని, హెూస్ పైప్ తీనుకుని పూల కుండీలకి నీళ్లు పోద్దామని బాల్కనీలోకి నడిచింది లావణ్య.

అంతలో పెద్దగా హారన్ వినిపించటంతో ఉలిక్కిపడి తలెత్తింది లావణ్య. నిండా సామాన్లతో 'చిర్రు' మంటూ కాలనీలో కొచ్చిన నీలం రంగు టెంపో ఎదురు లైన్‌లో ఉన్న ఫ్లాట్స్ ముందర ఆగింది. అందులోంచి కిందికి దిగిన అమ్మాయిని చూస్తూనే 'చక్కగా' ఉందని అనుకోకుండా ఉండలేక పోయింది లావణ్య.

టీవీ సీరియల్స్‌లోలా చక్కగా చేయించుకున్న ఫ్రంట్ కట్, పోనీ టెయిల్స్‌లో, సెల్వార్, లిప్‌స్టిక్‌లతో చాలా ఫ్రెష్‌గా, ఎట్రాక్టివ్‌గా ఉంది. ఆమెతో దిగిన అతను ఆమెకి చక్కని జోడీలా, టక్ చేసుకున్న ఫుల్ హాండ్స్ షర్ట్, మాస్‌లో స్మార్ట్‌గా ఉన్నాడు.

వరధ్యానంగా వాళ్లనే చూస్తూ నుంచుండి పోయింది లావణ్య. కాలనీ అంతా వరికించి చూస్తున్న ఆ అమ్మాయి చటుక్కున తలెత్తి పైన బాల్కనీలో ఉన్న లావణ్యని చూసి ఫ్రెండ్లీగా చిరునవ్వు నవ్వింది. తడబడి పోయి, బదులుగా నవ్వి, సిగ్గుగా లోపలికెళ్లి పోయింది లావణ్య - నిజంగా కంట్రీబ్రూట్‌లాగా వాళ్లని చూస్తూ నుంచున్నందుకు తనను తాను తిట్టుకుంటూ...

"ఏంటోయ్! ఎదురింట్లో కెవరో క్రొత్తగా దిగినట్లున్నారు?" ఆరాగా అడిగాడు శ్రీధర్ - రెండు రోజుల తర్వాత.

'అవును! కానీ, వాళ్లెవరని ఇంకా వివరాలేం తెలియవు-"

"పోనీ వాళ్లింటికి పోయి వరిచయం

[illegible] అంతరం [illegible]

[illegible] వద్దుకోడం [illegible] - వెళ్తా [illegible] తుంచేస్తూ అంది ల్యాణ్యా.

ఆదివారం -

సరిగ్గా ఎనిమిదో రోజున, కాలింగ్ బెల్ మోగటంతో తలుపు తీసింది లావణ్య.

ఎదుటి ఫ్లాట్‌లో దిగిన దంపతులు ఎదురుగా. -

"హలో" -

"రండి, రండి - కూర్చోండి" సాదరంగా ఆహ్వానించి

"ఏమండీ - ఎదుటి ఫ్లాట్‌లో వాళ్లొచ్చారంటూ" శ్రీధర్‌ని పిలుచుకొచ్చింది.

బైటికెళ్తున్నపుడు, బైక్ స్టార్ట్ చేస్తున్నపుడు ఆ అమ్మాయిని చూస్తూనే ఉన్నా ఇలా ఎదురుగా చూసినపుడు మరింత ఎట్రాక్టివ్‌గా, డైనమిక్‌గా ఉందనిపించింది శ్రీధర్‌కి.

"హలో, మీరు డ్రైవింగ్ బాగ్‌తో వెళ్తున్నపుడే అనుకున్నాను. నయన్ లాగానే మీరూ ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ అని! బైదిబై, అయామ్ అర్చన. దీసీజ్ మై హజ్బెండ్ నయన్." పరిచయాలు తనే చేసేసింది అర్చన.

"గ్లాడ్ టు మీట్ యూ"లు అయ్యాక, నయన్ హార్మోన్ డ్రగ్స్‌ని స్పెషలైజ్ చేసే కంపెనీకి రెప్ అనీ, అర్చన ఎం.ఎ. చేసి, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ కూడా చేసిందనీ, ఇంత క్రితం ఇల్లు బాగా చిన్నదిగా ఉండటంతో పెద్ద ఇల్లు కావాలని ఈ ఫ్లాట్స్‌లోకి మారారనీ తెలిసింది. గలగలా నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడటం అర్చన ప్రత్యేకతలా ఉంది. కొత్త పాత లేకుండా అందరితో కలిసిపోతుంది.


అర్చన ఇంగ్లీష్‌లో దంచేస్తుంటే జవాబు చెప్పలేక, నాకు "ఇంగ్లీష్ అర్థమౌతుంది గానీ మాట్లాడటం రాదని" చెప్పలేక ఇబ్బందితో తలమునకలై పోతున్న భార్యని చీదరగా "చెప్తే ఎప్పుడైనా విని చచ్చావా?" అన్నట్లు చూశాడు శ్రీధర్-

"ఇంత చదువు చదువుకున్నారు. ఏం ఉద్యోగం చేస్తున్నారు?" అడిగాడు అర్చనని.

"కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో స్పెషలిస్ట్ లైన ఒక ఇన్‌స్టిట్యూట్‌లో మార్కెటింగ్ ఆఫీసర్‌గా పనిచేసి, ఈ మధ్యనే రిజైన్ చేసేశాను"

"అదేం?"

"వాళ్లు నన్ను డోర్ టు డోర్ కాంపెయిన్ మీద వెళ్ల మన్నారు. నేను దెబ్బకి రిజైన్ చేసి పారేశాను", నవ్వింది అర్చన.




"ఇందులో నవ్వడానికేం ఉందనీ-" మనసులోనే విసుక్కుంది లావణ్య.

"మీరేం చేస్తుంటారు?" అడిగాడు నయన్.

"అబ్బే! నేనో సాధారణ గ్రాడ్యుయేట్‌ని. అంత కంటే సాధారణ హౌస్ వైఫ్‌ని," నిర్వికారంగా చెప్పింది.

"సాధారణ హౌస్ వైఫ్‌ని" అని అంటున్నారేమిటి - అంత తీసి పారేసినట్లు! ఇల్లిలా అద్దంలా పెట్టుకున్నారు! మా అర్చనకి ఇల్లు చూసుకోడమంటేనే చిరాకు. ఒక రోజు ముందరే "మీ ఇంటికొస్తున్నామండీ" అంటూ నోటీసివ్వకుండా ఎవరైనా వచ్చారంటే విరుచుకుని మరీ పడిపోతారు - అలా ఉంచుతుంది ఇంటిని -" నవ్వుతూనే పెళ్లాన్ని చురకవేశాడు.

"ఇల్లు చూపించండి - ఎలా ఉన్నాయో మిగతా గదులు చూద్దాం" అర్చన అడగడంతో ఇద్దరూ లోపలికెళ్లారు.

శ్రీధర్, నయన్‌లు కంపెనీ కబుర్లలో పడ్డారు. కట్‌త్రోట్ కాంపిటీషన్ గురించి, కంపెనీ స్ట్రాటజీల గురించి, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ల గురించి - ఒకటేమిటి - అన్నీ డిస్కస్ చేసుకున్నారు.

అంతలో పొగలు కక్కుతున్న మసాలా ఉప్మా ప్లేట్లతో వచ్చింది లావణ్య. వెనకాలే కాఫీ కప్పులున్న ట్రేతో అర్చన.

"ఏమిటీ!? ఇవన్నీ ఇప్పుడే చేశారా?" ఆశ్చర్యంగా అడిగాడు నయన్.

"ఎంత సేపనీ- క్షణంలో అయిపోతుంది-" చిరు నవ్వుతో చెప్తూ ప్లేట్లందించింది లావణ్య.

గంటన్నర తర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

"ఏమిటోయ్! నీ కేమైందివ్వాళ? కాఫీ లివ్వడానికే పెద్దగా ఇష్టపడని దానివి ఏకంగా ఉప్మానే చేసి తెచ్చేశావ్?" చురక వేసినట్లు అన్నాడు శ్రీధర్.

"బాగుంది! ముక్కూ మొహం తెలీని మీ ఫ్రెండ్ ఎవడికో కాఫీ ఇవ్వలేదని ఇలాగా సాధించేది? ఇది మీకేమన్న బాగా ఉందా? వీళ్లు మన నైబర్స్- మొదటి సారి వచ్చారు కాబట్టి చేశాను-"

"ఆ అమ్మాయిని చూశావా? ఎంత ఇంటెలిజెంట్‌గా, ఎక్టివ్‌గా ఉందో- నువ్వూ ఉన్నావు వప్పుసుద్దలా, ఎవరింటికైనా వెళ్లే వట్టుమని వది మాటలైనా మాట్లాడవు. అర్చనని చూసి నేర్చుకో- డైనమిక్‌గా ఎలా ఉండాలన్నది! ఎన్నిసార్లు చెప్పాను? చక్కగా ఇంగ్లీషులో మాట్లాడ్డం నేర్చుకోమని- ఆ అమ్మాయి మాట్లాడ్తుంటే దేభ్యంలా నుంచున్నావు-" తన మాటలు భార్యనెంత హర్ట్ చేస్తాయన్నది పట్టించుకోకుండా తన ధోరణిలో తను మాట్లాడేస్తాడు శ్రీధర్.

"అందరూ ఒకేలా ఉండరండీ. అది కాక, నేను ఎం.ఏ. చేస్తాను- నన్ను ఇంగ్లీష్ మీడియంలో పెట్టండి అంటే మీరే ఒప్పుకోలేదు. డిగ్రీ దాకా తెలుగు మీడియంలో చదివాను- ఇంగ్లీష్‌లో ఒక్కసారి ఎలా మాట్లాడెయ్యగలను" మనసు కష్టపెట్టుకున్నా శాంతంగానే జవాబిచ్చింది.

"చదివి ఏం అఘోరిద్దామనీ? అయినా, నువ్వు కాలేజీకి పోతే ఇంటినీ, నన్నూ ఎవడు చూసుకుంటాడనీ?" తీసి పారేశాడు.

రెండు నెలలు గడిచాయి...

క్రమంగా శ్రీధర్ చేసే "అర్చన స్తుతి- లావణ్య నింద"లకి కొదవ లేకుండా పోయింది. అర్చన ఏం చేసినా అద్భుతంగానే ఉంటుందతనికి. కాలనీలో ఉన్న ఖాళీ గ్రౌండ్‌లో, ప్రొద్దున్నే ఐదు గంటలకి లేచి మూడు రోజుల్లో కవాసాకి బజాజ్‌ని రైడ్ చేయడ్డం నేర్చుకుంది అర్చన. తన భార్యని కైనెటిక్ హోండా కీస్ చూడ్డానికి తను ఒప్పుకోడనీ, ఇంక రైడ్ చేయటం నేర్చే ప్రశ్న లేదనీ ఆ క్షణంలో శ్రీధర్‌కి గుర్తు రాలేదు! అర్చనని కంగ్రాచ్యులేట్ చెయ్యటానికి వాళ్ల ఇంటిక్కూడా వెళ్ళొచ్చాడు.

ఇదంతా గమనిస్తూ, ఓర్చుకోవాలని విఫల ప్రయత్నం చేస్తోంది లావణ్య. అర్చన ఒక విధంగా తెలివైనదైతే తాను మరొక విధంగా తెలివైనదేగా. తను ఎంత నీట్‌గా చేస్తుంది ఏ పనైనా? ఎంత రుచిగా వంటలు వండుతుంది? ఇప్పటికి మూడు సార్లు అర్చన ఇంట్లో ఏదో ఒకటి చేసి పెట్టింది. ఎంత చెత్తలా ఉన్నాయని! ఆవదం తాగినట్లు మొహం పెట్టుకున్నా అంత తిని చాలా బాగుందన్నాడు శ్రీధర్!! చేతికుట్లు అల్లికలు ఏవైనా ఎంత వేగంగా, నేర్చుకుంటుంది? ఫాబ్రిక్ పెయింట్స్ చేయటం తనకెంత చక్కగా వస్తుంది. తనకి ఇంటెలిజెన్స్ లేదా? అర్చనది ఒక రకమైన అందమైతే, తనది మరొక రకం- కవితల్లో వర్ణించినట్లు ముగ్ధలా, ముద్దబంతి పువ్వులా ఉంటుంది తను. చీర కడితే తనే కట్టాలంటారు చూసిన వాళ్లంతా. ఒత్తుగా, రింగులతో పెద్ద బారెడు జడ తనది. అర్చన సాఫిస్టికేటెడ్‌గా సెల్వార్‌లు, "బాగీ" పాంట్లు వేస్తుంది. తనకి కాస్త సిగ్గుగా ఉంటుంది అలా వేసుకోవాలంటే- ప్ఫ్! వాళ్లు వీళ్లలా ఔతారు? ఆ లెక్కన తనూ అర్చన భర్తతో తన భర్తను కంపేర్ చేసి, హర్ట్ చెయ్యగలదు- ఛా! ఇదేమిటి ఇలా పోతున్నాయి ఆలోచనలు- అనుకుంది ఆశ్చర్యంగా.

"లావణ్యా! గబగబా బ్రేక్‌ఫాస్ట్ పెట్టేయ్. ఈ రోజు అర్చనని తీసుకుని మా ఆఫీస్ కెళ్లాలి- బాస్‌ని మీట్ అయ్యేందుకు-"

"ఏం?"

"లేడీ మార్కెటింగ్ సర్వే ఆఫీసర్లు కావాలని అన్నార్లే వాళ్ళ రిక్వైర్‌మెంట్స్‌కి తగినట్లే ఉన్నాయి అర్చన క్వాలిఫికేషన్లు- రికమెండ్ చేద్దామని నేను వెళ్తున్నాను"-

కైనెటిక్ హోండా మీద శ్రీధర్ వెనకాల కూర్చుని వెళ్తున్న అర్చనని చూసేసరికి పుండు మీద కారం చల్లినట్లు అయింది లావణ్యకి- దుఃఖం ఎగతన్ను కొచ్చేసరికి చేతకాని తనంతో వెక్కి వెక్కి ఏడ్చింది.

ఈ మధ్యన శ్రీధర్ వాళ్లింటికి తెగ వెళ్తున్నాడు. నయన్ అప్పుడప్పుడు మాత్రమే వస్తాడు. ఒకవేళ శ్రీధర్‌తో తనూ వెళ్లినా, అర్చన తనతో అస్సలు ఫ్రెండ్లీగా ఉండదు. కావాలని ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతుంది. నయన్ మాత్రం తన భార్య ప్రవర్తనని గమనించినవాడిలా ఎక్కువసేపు తనతో మాట్లాడతాడు. చివరికి తనే అర్చన ఇంటికి వెళ్లడం మానేసింది పూర్తిగా. అర్చనా రాదు. ఇప్పుడేమో వాళ్ళిద్దరూ కలిసి పని చేస్తూంటారు కాబోలు! ఇంతకు ముందర అప్పుడప్పుడు ఏదో కాస్త విసుక్కునేవాడు. అర్చన వచ్చాక తనని ఆమెతో పోల్చి మరీ పురుగుని తీసి పారేస్తున్నట్లు తీసి పారేస్తున్నాడు. దీనికో అంతం చూడాలి. దృఢంగా నిశ్చయించుకుంది లావణ్య..

వారం తర్వాత-

నయన్ కాంప్ మీద వెళ్ళిపోయాడు. జోనల్ మీటింగ్ మీద శ్రీధర్ కూడా ఊళ్లో

లేడు. ఇంత కంటె మంచి నమయం ఇక రాదు-


కాలింగ్ బెల్ మ్రోగటంతో చదువుతున్న పుస్తకం అలాగే పడేసి వచ్చింది అర్చన. ఎదురుగా లావణ్య...

"మా వార్ని ఇంప్రెస్ చేయటం కోసం మీరు తెగ తిప్పలు పడిపోతున్నట్లు కని పిస్తోంది నాకు. ఆయన రాకపోకల్ని ఎందుకు అంతగా ఎంకరేజ్ చేస్తున్నారు? మిమ్మల్ని ఆయన మెచ్చుకుంటే నాకేం జెలసీ లేదు- కానీ, నన్నో పురుగుని చూసినట్లు చూడ్డం భరించలేకుండా ఉన్నాను. ప్లీజ్! స్టాప్ ట్రైయింగ్ టు ఇంప్రెస్ మై హజ్బెండ్! "కోపం, ఆవేశం, అభ్యర్థన కలగలసి చాలా ఎమోషనల్‌గా అంది లావణ్య.

"నేనెప్పట్నించో మీకు చెప్దామని అనుకుంటున్నది మీరే చెప్పారు. థాంక్స్! యూ ఫస్ట్ స్టాఫ్ ఇంప్రెసింగ్ మై హజ్బెండ్" నొక్కి పలుకుతూ అంది అర్చన.

"వ్వాట్?"

"అవును! వింతగా ఉందా? నా వంట చెత్తలా ఉంటుందని దెప్పి పొడవడానికేగా- మీ ఇంటి కొచ్చినప్పుడల్లా కోఫ్తాలు,




బొబ్బట్లు, చాకొలెట్ కేకులు, బిర్యాని, కుర్మాలు- చేసి మరీ పెడుతుంటారు! అక్కసుగా అంది.

"అదేం లేదండీ! మీరేదో చేసి పెడుతుండటంతో ప్రతిగా, విధిగా మీరొచ్చినప్పుడల్లా నేనూ ఏదో చేసి పెడ్తున్నాను తప్ప ఇంకే కారణం వల్లా కాదు- "ఆశ్చర్యంగా, కాస్త హర్ట్ అయి, అంది లావణ్య.

"మిమ్మల్ని చూసి లక్షా తొంబై సుగుణాలు నేర్చుకో మంటున్నాడు నయన్. చీరలో ఉన్న అందం ఇంకెందులోనూ లేదంటాడు. ఆడవాళ్లు మీలా పొందికగా, అణుకువగా ఉండాలి తప్ప నాలా ధైర్యంగా, ఎడ్వెంచరస్‌గా ఉండటంలో అందం లేదుట! బాగా వంట చేసి, ఇల్లు సర్దుకో లేని ఆడ జన్మా ఓ జన్మేనా అంటాడు. మీ దగ్గర కుట్లు, అల్లికలు నేర్చుకోవాలిట నేను! మీలాగా నింపాదిగా, నిదానంగా ఉంటూ అవసరమైనంతే మాట్లాడాలిట! నాలాగా వస పోసిన పిట్టలా వాగే వాళ్లని చూస్తే తనకి చిరాకుట! "ఆయనేమన్నా ఎదురు సమాధానాలు, ప్రశ్నలు రావు లావణ్య నోటి వెంట- నువ్వూ ఉన్నావు- ప్రతిదానికి ఎదురు ప్రశ్న వేసీ, సమాధానాలు చెప్పి, బ్రహ్మరాక్షసిలా పడిపోతావు-" అంటాడు. ఇవన్నీ వింటుంటే చావాలని పిస్తోంది! డోర్ మేట్‌లా పెళ్లాం ఉంటే లైఫ్ బోర్ కొడుతోంది డల్‌గా ఉంటుందంటారీ మగాళ్లు. అదే డైనమిక్‌గా, ఎక్స్‌ట్రావర్ట్‌లా ఉంటే అణిగి మణిగి ఉండమని ఏడిపించుకుతింటారు! ఎలా బ్రతకాలో అర్థం కాదు. ఇంకోళ్ల పెళ్లాంతో పోల్చి "అలా ఉండు" అని వాళ్ళు మనకి చెప్పొచ్చు గాని, ఇంకోళ్ళ భర్తతో పోల్చి అలా నువ్వెందుకు ఉండవు "అంటే ఏకంగా మన శీలాన్నే శంకిస్తారు-" కళ్లల్లో గిర్రున నీళ్లు తిరగడంతో డగ్గుత్తికతో ఆగింది అర్చన.

అవాక్కైపోయింది లావణ్య.

మనసు కోతి లాంటిదంటే ఇదే కాబోలు! మనిషి కేది ఉంటే అది నచ్చదు. లేనిది కావాలని అర్రులు చాస్తాడు. ఇందుకేనన్న మాట అర్చన తనతో ఎప్పుడూ ఫ్రెండ్లీగా లేదు- తనూ అందుకే తనతో మనసిచ్చి మాట్లాడలేకపోయింది. భర్త తనను మెచ్చుకోకుండా పోయాక ఇంక ఏం చెయ్యాలన్నా అనకే ఉండదు.

బ్రహ్మచారీ శత మర్కటః అన్నారు-... మరి గృహస్థుని శతసహస్ర మర్కటః అనాలో ఏం పాడో-!!!

ఎవరి ఆలోచనల్లో వారు సతమతమైపోతూ "ఏం చెయ్యాలిప్పుడు" అని తలలు పట్టుక్కూలబడ్డారు ఆ ఇద్దరు అమ్మాయిలూ...

## చట్టాన్ని పరిహాసం చేసిన రైతు

రాజస్థాన్‌లో, ఒక పరిమితిని మించి ఎవ్వరు భూమి ఉంచుకొనకూడదని, చట్టం అమలులో ఉంది. ఒక ధనవంతుడి వద్ద, చట్టాన్ని మించి భూమి చాలా ఎక్కువగా ఉంది. చూస్తూ చూస్తూ దీన్ని వదులుకోవడం, ఆ భాగ్యవంతుడైన రైతుకు సుతరాము ఇష్టం లేదు. అందుచేత మిగులు భూమిని, ముక్కలు చేసి, 'సోనియ' మరియు 'బీను' అను ఇరువురికి స్టాంపు కాగితం మీద సంతకం చేసి పంచిపెట్టేశాడు. 'సోనియ' 'బీను' ఎవరని అడిగితే భార్యా భర్తలని సమాధానం చెప్పాడు 'బీను' భర్త- సోనియ భార్య అని, రిజిష్టర్ చేయించాడు. ప్రభుత్వం అతనిమాటలు విశ్వసించింది. అయితే, అసలు విషయమేమిటంటే, వీరు దంపతులు కానిమాట అటుంచి, వీరు ఇరువురు మనుష్యులు కారు. మనుష్యులు కాక, జంతువులా అని అడుగుతున్నారా? అవును నిజం. "బీను" ఆ ధనిక రైతు పొలందున్నే దున్న పోతు 'సోనియ' అన్నది, గేదె కూడకాదు. అతని పెంపుడు కుక్క. చట్టాన్ని చక్కగ మోసం చేసిన ఈ రైతుపైన ప్రభుత్వం ఏవిధంగా చర్య తీసుకొన్నది తెలియదు.

డా॥ పి.రాజగోపాలరావు.

## లక్షన్నర పూలు !

ప్రకృతికే అందాన్నిచ్చే పుష్పాలు మొక్కల ప్రత్యుత్పత్తి అంగాలు. చిత్రకారుని కుంచె కందని రంగుల్లో దర్శనమిచ్చి ఆనందాన్ని కల్గిస్తాయి. ప్రపంచంలోనే అత్యధికంగా పూలు పూచే మొక్క అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఉంది. దీనిపేరు చైనీస్ విస్టీరియా. ఈ చెట్టు శాఖలు 500 అడుగులు ఉంటాయి. వృక్షం బరువు సుమారు 225 పౌన్లు, పుష్పించే తరుణంలో ఒకే సారిగా 1,50,000 పుష్పాల్ని పుష్పిస్తుంది.

## బాటనీ

ప్రాచీన గ్రీక్ భాషలో 'బొస్' అనే పదానికి పశువులు అనీ, బొస్కేన్ అనే పదానికి పశువులచే మేయబడేది అని అర్థం. కొంతకాలం తరువాత బొస్కేన్‌కి బదులు బోటేన్ అనే పదం వాడుకలోకి వచ్చింది. అలా 'బాటనీ' [వృక్షశాస్త్రం] పేరొచ్చింది.

-సమ్మెట

## లల్లాయి పదాలు

ఎవరైనా పాటలు పాడుతుంటే, లల్లాయి పదాలు పాడుతున్నాడు అంటాం. అసలు ఈ "లల్లాయి పదం" అన్నది ఎక్కడి నించి పుట్టింది? దీనర్థం ఏమిటి?

12వ శతాబ్దంలో కాశ్మీర దేశంలో ఒక మహా భక్తురాలు ఉండేది. 'మీరా'బాయి లాగా, ఆవిడకి శ్రీకృష్ణుడంటే మహా ఇష్టం. ఎప్పుడూ ఆయన్నే కొలుస్తూ, తలుస్తూ ఉండేది. ఆవిడ నోటి వెంబడి శ్రీకృష్ణ స్తుతి తప్పించి వేరే మాట వచ్చేది కాదు. ఆయన మీద పాటలు కట్టి పాడుతూ ప్రచారం చేస్తూ ఉండేది.

ఆ రోజుల్లో, ప్రయాణానికి, బస్సులు, కార్లు, కనీసం సరి అయిన నడక దారి కూడా లేని కాలంలో ఆవిడ దుర్గ మార్గాల గుండా ప్రయాణించి, భారతదేశం అంతా, మూల మూలలా పర్యటించి శ్రీ కృష్ణ భక్తిని, తత్వాన్ని పాటల రూపంలో ప్రచారం చేసింది.

ఆవిడ పేరే "లల్ల" ఆ పేరు మీద గానే "లల్లాయి పదం" అన్న నానుడు పుట్టింది. ప్రతి భాష లోనూ ఇలాంటి పదం ఒకటి ఉంది. హిందీలో "లల్లాకెగానె" అని అంటారు.

కె.వి.రమణమూర్తి